క్లుప్తంగా

స్వర్ణ హోమియో వైద్యాధికారిగా ప్రదీప్


డాక్టర్ ప్రదీప్‌కుమార్

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ హోమియో వైద్యాధికారిగా డాక్టర్ ప్రదీప్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటివరకు ఈయన ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా హోమియో వైద్యంపై మక్కువ చూపుతారని, ఇకపై తాను ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారికి సరైన వైద్యం అందిస్తానన్నారు.

వైద్యుల సూచనలు పాటిస్తే ఆరోగ్యం

చీరాల టౌన్: గర్భిణులు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామంలోని గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు 20 రోజులకు ఒకసారి విధిగా వైద్యుల వద్ద సేవలు పొందాలన్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడంతో పాటుగా పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం విధిగా రోజువారీ ఆహారంలో ఉండాలన్నారు. ప్రసవాలు జరిగేంత వరకు గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు జరిగేలా చూసుకోవాలని, గర్భిణులు ప్రసవాల కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాలకే ముప్పు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకట్రావు

కారంచేడు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఎస్సై వీ వెంకట్రావు హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని స్వర్ణ–జరుబులవారిపాలెం రోడ్డులోను, కారంచేడు–ఆదిపూడి రోడ్డులోను వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్క ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కొద్ది దూరమే కదా అని హెల్మెట్ లేకుండానే రోడ్లపైకి వచ్చి అనుకోకుండా జరిగే ప్రమాదాల్లో ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. కొద్దిపాటి నిర్లక్ష్యమే కుటుంబాలను దిక్కులేని వారిగా చేస్తున్నాయన్నారు. ద్విచక్రవాహనదారుకు హెల్మెట్ లేని ప్రయాణాన్ని గుర్తించి వారికి పెనాల్టీలు సైతం వసూలు చేస్తున్నామన్నారు. ఆటోలు కూడా మితిమీరిన వ్యవసాయ కూలీలతో పరిమితికి మించి ఎక్కించుకొని ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సుమారు 10 మందికి ఆయన చలానాలు రాశారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అద్దంకి రూరల్: వ్యాసరచన పోటీల్లో కేఆర్కే విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 8వ తేదిన ఒంగోలులోని ప్రియదర్శిని లా కళాశాలలో లా విద్యపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో అద్దంకి కేఆర్కే కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులు ఎస్ చిన్ని లింగయ్య, ఎన్ శౌరమ్మలను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్ఎం

చీరాల అర్బన్: రాష్ట్ర సమగ్ర శిక్ష కార్యాలయ ఆదేశాల మేరకు ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు నాలుగు రోజులు పాటు భాషా దినోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం వేటపాలెం మండలం పందిళ్లపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ భాషా ఉపాధ్యాయులు శంఖం లలితా పరమేశ్వరి, బుద్ధి ప్రసన్నాంజనేయులు ఆధ్వర్యంలో హిందీ భాషా గొప్పదనాన్ని వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు కథలు చెప్పడం, గేయాలు, కవితలు, దోహాలు చక్కని అభినయంతో ఆకట్టుకున్నారు. 9వ తరగతి విద్యార్థులు తేజస్విని, బాంధవ్య, బిందు శ్రీలత వరుసగా మనదేశ అధికార భాష అయిన హిందీ భాష గొప్పతనాన్ని గురించి గేయాలు, కవితలతో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం శేఖరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరక ప్రయాణాలు..!

- కారంచేడు మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లు
- వాహనదారుల తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


స్వర్ణ–దగ్గుబాడు రోడ్డుపై కంకర రాళ్లతో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

కారంచేడు: గుంతలు లేని రహదారులను నిర్మించాలని ప్రభుత్వ పెద్దలు అధికారులను ఆదేశించడం.. రోడ్లు వేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పుకోవడమే కాని క్షేత్రస్థాయిలో అనేక ప్రాంతాల్లో రహదారులు నేటికీ గుంతలమయంగానే దర్శనమిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రహదారుల్లో సైతం రహదారులు ప్రయాణాలకు సౌకర్యంగా లేక వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణాల్లో నరకం చూడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. మండల కేంద్రం కారంచేడు నుంచి స్వర్ణ మీదగా ఇంకొల్లు వెళ్లే రహదారి, మండలంలోని ఆదిపూడి నుంచి తిమిడెదపాడు గ్రామానికి వెళ్లే రహదారులు రోడ్డుపై రాళ్లు లేచి ప్రమాదకరంగా మారాయి.

వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు..

నిత్యం వందల సంఖ్యలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, లారీలు, ట్రాక్టర్లు ప్రయాణించే స్వర్ణ–దగ్గుబాడు రోడ్డు భయంకరంగా మారిందని ప్రయాణికులు చెబుతున్నారు. చీరాల నుంచి దండుబాట రోడ్డు గుండా స్వర్ణ మీదుగా ఇంకొల్లు, దగ్గుబాడు, పోతినవారిపాలెం, కొడవలివారిపాలెం, కేశవరప్పాడు, తిమిడెదపాడు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఈ రహదారిలోనే ప్రయాణించాలి. వీరు ప్రయాణించేందుకు తప్పకుండా ఆటోలు, ద్విచక్రవాహనాలను వినియోగిస్తారు. స్వర్ణ వాటర్ ట్యాంక్ నుంచి క్రాస్ రోడ్డు వరకు ఉన్న రహదారిని నిర్మించేందుకే గత ప్రభుత్వం సుమారు రూ 1.5 కోట్లు నిధులు కేటాయించి టెండర్లు పిలిచారు. టెండర్లు పాడుకున్న కాంట్రాక్టరు అప్పటి వరకు గుంతలమయంగా ఉన్న రహదారిని పొక్లెయిన్ సాయంతో చదును చేశారు. తరువాత ఒక లేయర్ మెటల్ వేశారు. ఈలోగా ఎన్నికల జరగడం, ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. సుమారు ఏడాది కాలంగా ఇదే పరిస్థితి ఉందని ప్రయాణికులు చెప్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

గ్రావెల్ వేశారు.. రోలింగ్ మరిచారు..

మండల కేంద్రమైన కారంచేదు నుంచి ఆదిపూడి మీదుగా తిమిడెదపాడు వెళ్లే ప్రజలు, వాహనదారులు ఈ రోడ్డులోనే ప్రయాణిస్తుంటారు. ఆదిపూడి నుంచి తిమిడెదపాడు వరకు సుమారు 2.2 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డులో అనేక మంది రైతులు తమ పొలాలకు బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల్లో వెళ్తుంటారు. అదే రోడ్డులో ఆదిపూడి ఉన్నత పాఠశాల కూడా ఉంది. ఈ పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా ఈ రహదారినే వినియోగిస్తారు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డును ప్యాచ్ వర్క్ కింద సుమారు రూ.5 లక్షలు మంజూరు చేయగా వాటితో గ్రావెల్ తోలారు. కానీ రోలింగ్ చెయ్యకుండా ఆపివేయడంతో ఈ రోడ్డులో నడవడానికి కూడా ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలకు పంచర్లు అవుతున్నాయి..

నేను ప్రతి రోజూ తిమిడెదపాడు నుంచి స్వర్ణ మీదగా కారంచేడు, చీరాలకు వెళ్తుంటాను. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుంది. రోడ్డు వేయడానికి మెటల్ వేశారు. వీటిని రోలింగ్ చేసి తారు వేయాల్సి ఉంది. రాత్రి సమయాల్లో ప్రయాణం మరీ నరకం. టైర్లు కూడా పంచర్లు అవుతున్నాయి. పంచర్ అయితే మూడు కిలోమీటర్లు నడిపించుకువెళ్లాల్సి వస్తుంది.
– డీ వీరాంజనేయులు, తిమిడెదపాడు

త్వరితగతిన చదును చేస్తాం..

ఆదిపూడి నుంచి తిమిడెదపాడు వరకు రోడ్డును వేయాల్సి ఉంది. గుంతలుగా ఉండటంతో తాత్కాలిక మరమ్మతుల నిమిత్తం మండల గ్రాంట్ నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. గ్రావెల్ వేశాం. రోలింగ్ చేయాల్సి ఉంది. వెంటనే రోలింగ్ చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయిస్తాం.
– సీహెచ్ రామచంద్రుడు, పీఆర్ ఏఈ


ఆదిపూడి–తిమిడెదపాడు రోడ్డులో రోలింగ్ చేయకుండా ఆగిపోయిన గ్రావెల్ రోడ్డు

ఉన్నతాధికారులకు నివేదించాం..

స్వర్ణ గ్రామం నుంచి దగ్గుబాడు వెళ్లే రహదారిలో పనులు ప్రారంభించాం. ఇంత వరకు వేసిన రోడ్డుకు బిల్లులు అవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేశాం. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
– సీహెచ్ శ్రీకాంత్, ఆర్అండ్‌బీ ఏఈ

పంట మార్పిడితో ఎండు తెగులు నివారణ


పుల్లరిపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


అడుసుమల్లి రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పర్చూరు (చినగంజాం): శనగలో ఎండుతెగులు నివారణకు పంట మార్పిడి చేయాలని పర్చూరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎస్ మోహనరావు అన్నారు. మండలంలోని అడుసుమల్లి, గొల్లపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏవో ఎస్ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ శనగ పంటలో ఎండు తెగులు, వేరుకుళ్లు తెగులు నివారణకు రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి విధానం చేయాలని తెలిపారు. శనగ పైరుకు బదులుగా జొన్న, మొక్కజొన్న, సజ్జ పైరులు వేసుకోవాలని తెలిపారు. పంట మార్పిడి జొన్న, మొక్కజొన్న, సజ్జ పైరు వేయడం వలన ఎండు తెగులు ఆశించు శిలీంధ్రాలు నశిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ గ్రామ రైతులు, వీఏఏలు ఆదిలక్ష్మి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈ–కేవైసీ చేయించుకోవాలి

ఇంకొల్లు (చినగంజాం): శనగ, మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏవో పీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని దుద్దుకూరు, గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: ప్రభుత్వం రైతులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్ అన్నారు. వేటపాలెం మండలంలోని పుల్లరిపాలెం, బచ్చులవారిపాలెం, ఊటుకూరి సుబ్బయ్యపాలెంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం విజయవాడ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, అధికారులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎస్‌హెచ్‌కె వీరయ్య చౌదరి, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ టి.ప్రేమరంజిత, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యతో ఉపయోగాలు

స్వర్ణ (కారంచేడు): అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణ పొందాలని ఎంఈవో ఎంవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్వర్ణ సెక్టార్ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలతో ప్రభుత్వం అందించే మంచి పౌష్టికాహారంతో పాటు, ఆట, పాటలు చేర్పించి, విద్యా, బుద్ధులకు బీజం వేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంవీ సుబ్బారావు, డీఆర్‌పీలు ఎస్ నరశింహారెడ్డి, సూపర్‌వైజర్ సునీతలు పాల్గొన్నారు. కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పద్మావతి అధ్యక్షతన శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యాబోధనలకు పట్టికలను కార్యకర్తలు తయారు చేశారు. డీఆర్‌పీలుగా వీ బాబూరావు, రేణుకాదేవి, సూపర్‌వైజర్ హిమబిందు, కారంచేడు సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన అవసరం

యద్దనపూడి: జాతీయ నూతన విద్యా విధానం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పెను మార్పులు తీసుకువచ్చిందని.. దీనిపై అంగన్‌వాడీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎఫ్‌ఎల్‌ఎన్ జిల్లా కో ఆర్డినేటర్ సుభాని సూచించారు. యద్దనపూడి ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో పూర్వప్రాథమిక విద్య ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత, ఉన్నత పాఠశాల హెచ్ఎం దేవేంద్రరావు, రీసోర్సు పర్సన్లు వంశీకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటరామయ్య, దీపాదేవి, తదితరులు ఆల్గొన్నారు.


కుంకలమర్రులో విద్యాబోధనల పట్టిక ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ సుభాని


స్వర్ణలో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే పథకాలు


కొత్తూరులో రైతులతో మాట్లాడుతున్న ఏవో


మాట్లాడుతున్న ఏడీఏ ధన్‌రాజ్

అద్దంకి: ప్రత్యేక గుర్తింపు సంఖ్యతోనే ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయని ఏడీఏ ధన్ రాజ్ పేర్కొన్నారు. మండలంలోని కలవకూరు, శింగరకొండ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు 9642 మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకూ 4640 మంది మాత్రమే ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందినట్లు వెల్లడించారు. అదే విధంగా పీఎం కిసాన్ పథకం వర్తించని రైతులు 1400 మందికి గుర్తింపు సంఖ్యను పొందారని వెల్లడించారు. ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య అవసరం అన్నారు. ఇంకా గుర్తింపు సంఖ్య పొందని వారంతా గుర్తింపు సంఖ్యను పొందాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి..

బల్లికురవ: సాగు భూమి ఉన్న రైతులంతా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎస్వీపి కుమారి అన్నారు. బుధవారం కొత్తూరు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రెండు రోజులకు 11 అంకెల ఐడీ నంబర్ రైతుల ఫోన్‌కు వస్తుందని తెలిపారు. దానిని భద్రపరుచుకోవాలనాన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి పొలం 1 బీ, ఆధార్ నంబర్, ఆధార్ లింకు అయిన మొబైల్ నంబర్ అవసరం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ చెన్నకేశవ, ప్రసన్న పాల్గొన్నారు.

చీరాల డిప్యూటీ డీఈవోగా గంగాధరరావు


డిప్యూటీ డీఈవోను సత్కరిస్తున్న ఎంఈవో, సహచరులు

చీరాల అర్బన్: చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా గంగాధరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చీరాల మండలం ఈపూరుపాలెంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని డీవైఈఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అద్దంకిలో ఎంఈఓగా పనిచేస్తున్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా డీఈఓ నియమించారు. ఎంఈఓగా పనిచేసిన కాలంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భంగా నూతన డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ చీరాల పరిధిలో ఉన్న పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

షేడ్ నెట్‌తో బహు లాభాలు

మార్టూరు: రైతులకు షేడ్ నెట్ వ్యవసాయం సురక్షితంగాను లాభసాటిగా ఉంటుందని.. అందుకే ప్రభుత్వం 50% రాయితీ కల్పించి ప్రోత్సహిస్తుందని డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం రైతులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక షేడ్ నెట్ విలువ రూ.3.22 లక్షలని ఉద్యానవన శాఖ ద్వారా 50% రాయితీ లభిస్తుందన్నారు. మిగిలిన 50% శ్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, డీపీఎం రామ్మోహన్ రావు, ఏసి లక్ష్మణాచారి, ఏపీఎంలు రమణయ్య, సురేంద్ర, సీసీలు, రైతులు పాల్గొన్నారు.

నూరు శాతం పనిదినాలు

అద్దంకి రూరల్: ఉపాధి హామీ పనుల కూలీలకు మార్చి నెలాఖరు నాటికి 62000 పనిదినాలు కల్పించి 100 శాతం పనిదినాలు సాధించటానికి ఎఫ్ఏలు కృషి చేయాలని ఎంపీడీవో శింగయ్య అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 ఫారం పాండ్లు గుర్తించి మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. గోపాలపురంలోని ఎస్టీకాలని సందర్శించి శానిటేషన్ మెరుగు పరచాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

అద్దంకి రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో దొరికిన కొందరికి కోర్టు జరిమానా విధించింది. ఎస్సై ఖాదర్ బాషా వివరాల మేరకు.. తాగి మోటార్‌సైకిల్ నడిపిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున, ఐచర్ లారీ వ్యక్తికి రూ. రూ.10 వేల చొప్పున అద్దంకి సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శింగయ్య జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు

బ్యాంకింగ్ రంగంలో ఖాళీలు భర్తీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

చీరాల: బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఖాళీలను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేసి బ్యాంకు ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల నాయకులు అన్నారు. బుధవారం చీరాలలోని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో యుఎఫ్‌బీయు ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగులపై పని భారం తగ్గించాలన్నారు. వారానికి ఐదు రోజులు మాత్రమే పని సమయాన్ని పెట్టాలన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగుల సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసు, శ్రీనివాసరావు, శ్రీధర్, వాసు, బ్రహ్మయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులు పెంపొందించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ పద్మ

పర్చూరు (చినగంజాం): స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధులు పెంపొందించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ పీ పద్మ అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సంఘం సహాయకుల శిక్షణకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘంలో సభ్యులకు జీవనోపాధులు పెంపొందించాలని తెలియజేశారు. అదే విధంగా పాడి పరిశ్రమ అభివృద్ధి చేయాలని ప్రతి గ్రామ సంఘంలో పాడి గేదెల కొనుగోలు చేయించాలని ఫిబ్రవరి నెలాఖరులోపు మండలానికి 50 గేదెలు కొనుగోలు చేయించాలన్నారు. వారికి రుణ సౌకర్యం, స్త్రీ నిధి ద్వారా గాని బ్యాంకు లింకేజ్ ద్వారా గాని కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ ఏ లక్ష్మణాచారి, ఏపీఎం కే రామకృష్ణ, ఎఫ్‌పీఓ ఏపీఎం ఆర్ చిన్నయ్య, సీసీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ


మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం: అంగన్‌వాడీ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంఈఓ బొల్లిముంత అజయ్‌బాబు అన్నారు. మంగళవారం జ్ఞానజ్యోతి శిక్షణ మొదటి విడతలో భాగంగా రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో ఎంఈఓ బీ అజయ్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావులు ఐదు రకాల అభివృద్ధిల గురించి తెలియజేశారు. శారీరక, భాష, మేధస్సు, సామాజిక–భావోద్వేగాభివృద్ధి, సౌందర్య–సాంస్కృతిక అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కే రామారావు, సూపర్‌వైజర్ కే వాణిశ్రీ, ఎన్ సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.